క్లుప్తంగా

బీఎస్పీ బలోపేతానికి కృషి



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురంలో బీఎస్పీ ఆధ్వర్యంలో బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు నాగమోని చెన్నరాములు, జిల్లా ఇన్చార్జ్ గణపురం కృష్ణ హాజరై బీఎస్పీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో రమేష్, ఎంపీటీసీ గూడెం ఎల్లస్వామి, భీసన్న, మద్దిలేటి, శ్రీనివాస్, ధర్మ, విష్ణు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముళ్ల పొదల తొలగింపు



అమరచింత: మస్తీపురం ఎక్స్‌రోడ్ వద్ద మలుపులో ముళ్లపొదలు ఏపుగా పెరగడంతో ఎస్ఐ శివనాగేశ్వరనాయుడు తమ సిబ్బందితో తొలగింపు కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. జేసీబీ సాయంతో ప్రధాన రహదారిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదలను తొలగించారు. ఈమేరకు ఎస్ఐ మాట్లాడుతూ ప్రాజెక్టు రహదారిలో నిత్యం వాహనాల రాకపోకలు అధికంగా ఉంటున్నాయన్నారు. మలుపుల వద్ద ముళ్లపొదలు ఉండటంతో ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించలేక ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు.

అసంపూర్తి డ్రెయినేజీతో ఇబ్బందులు



పాన్‌గల్: మండల కేంద్రంలోని పలు కాలనీల్లో అసంపూర్తి డ్రెయినేజీలతో మురుగు నిల్వ ఉండడంతో దుర్గంధం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగు నిలిచి వాటిలో ఈగలు, దోమలు వృద్ధి చెందడంతో ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాలికల ఉన్నత పాఠశాల, రామాలయం, ఎమ్మార్సీ కార్యాలయం సమీపంలో డ్రెయినేజీ నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా మిగిలిపోయిన డ్రెయినేజీ నిర్మాణాలను పూర్తి చేసి ఇబ్బందులను తొలగించాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



వనపర్తి క్రైం: జిల్లా కేంద్రంలోని 22వ వార్డుకు చెందిన ఆటోడ్రైవర్ సర్దార్ అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి రూ.5వేల ఆర్థికసాయం పంపించారు. ఆదివారం టీడీపీ పట్టణ అధ్యక్షుడు నందిమల్ల అశోక్ మృతుడి భార్య జూహిదాబేగం కు నగదును అందజేశారు. అనంతరం కుటుంబ సభ్యులను రావుల ఫోన్ ద్వారా పరామర్శించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు ఖలీల్, గొల్ల శంకర్, అనిల్‌కుమార్, లక్ష్మన్న తదితరులు ఉన్నారు.

ఎండీ గౌస్‌కు సన్మానం



పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని ఉత్తమ టీడీపీ కార్యకర్త ఎండీ గౌస్‌ను పెబ్బేరు, శ్రీరంగాపూర్ మండలాల కార్యకర్తలు ఆదివారం ఘనంగా సన్మానించారు. తెలుగుదేశం పార్టీ 41 ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి గౌస్‌ను ఉత్తమ కార్యకర్తగా ఎంపిక చేశారని తెలిపారు. కార్యక్రమంలో సితార వెంకటేశ్వర్లు, గోల్డ్ బాలస్వామి, మాధవరెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి, వెంకటేష్, భీష్మ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కోయిల్‌కొండ: మండలంలోని గార్లపహాడ్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కాంగ్రెస్ నారాయణపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కె.శివకుమార్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మధు, రమేష్, ఆనంద్, హరి, నరేష్‌గౌడ్, విద్యాసాగర్‌గౌడ్, ఎల్లన్న, హాజీ, మహబీన్ పాల్గొన్నారు.

23 ఏళ్లకు మోక్షం

- అప్పారెడ్డిపల్లి, సల్కెలాపురం రోడ్డు మంజూరు
- ఎంఎంఆర్ నిధులు 88.38 లక్షలతో పనులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు



చాపల కాల్వపై నిర్మిస్తున్న పైపు కల్వర్టు

ఖిల్లాఘనపురం: ప్రభుత్వాలు మారాయి, ముఖ్యమంత్రులు, ఎమ్మెల్యే మారారు కానీ ఆ గ్రామాల మధ్య ఉన్న రోడ్డు మరమ్మతుకు నోచుకోలేదు. ఏళ్లు గడుస్తున్నా, రోడ్డుకు గుంతలు పడి మడుగులను తలపించినా పట్టించుకున్న వారే లేరు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత అన్ని బీటీ రోడ్లకు రినివల్ కోట్ వేసినా.. ఈ రోడ్డుకు ఎవరూ గుర్తించలే. ఎట్టకేలకు సర్పంచ్ కృష్ణవేణి, గ్రామ పెద్దలు, ప్రజల విన్నపాలను గుర్తించిన వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి కృషి ఫలితంగా ఈ రోడ్డుకు ఇప్పుడు మోక్షం లభించింది.

బీటీ రోడ్డు ఏర్పాటు

మండలంలోని అప్పారెడ్డిపల్లి–సల్కెలాపురం గ్రామాల మధ్య ఉన్న మట్టి రోడ్డును సుమారు 23 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం 30 శాతం గ్రామస్తులు, 70 శాతం ప్రభుత్వ నిధులతో ఈ రోడ్డును బీటీ రోడ్డుగా మార్చారు. నాటి నుంచి ఈ రోడ్డును ఏ నాయకుడు పట్టించుకోకపోవడంతో పూర్తిగా గుంతలు ఏర్పడి వర్షాకాలంలో మడుగులను తలపించాయి. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో రాష్ట్రంలోని అన్ని బీటీ రోడ్లకు రినివల్ కోట్ వేసినప్పటికీ అధికారుల పుణ్యమా అని ఈ రోడ్డును అసలు లెక్కలోకి తీసుకోలేదు.

రూ.88.38 కోట్లు మంజూరు

మండలంలోని అప్పారెడ్డిపల్లి నుంచి సల్కెలాపురం వరకు రోడ్డు పూర్తిగా పాడైపోవడంతో వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి కృషితో ఎంఎంఆర్ నిధులు రూ.88.38 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో రోడ్డు మొత్తం ఒక లేయర్ మెటల్ మిక్స్ వేయడంతో పాటుగా చాపల కాల్వకు పైపు కల్వర్టు, రెండు గ్రామాల ముందు భాగాన 200 మీటర్ల సీసీ వేసి మిగతా రోడ్డు మొత్తానికి బీటీ వేస్తామని పంచాయతీ రాజ్ శాఖ అధికారులు తెలిపారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ఇప్పటికే ప్రారంభించారు.

సంతోషంగా ఉంది



అప్పారెడ్డిపల్లి నుంచి సల్కెలాపురం వరకు రోడ్డు పూర్తిగా పాడైపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి కృషితో రోడ్డు మరమ్మతుకు నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. చాలా సంతోషంగా ఉంది. ఈ రోడ్డు బాగైతే మండలం నుంచి బిజినేపల్లి మండలంలోని చాలా గ్రామాలకు వెళ్లేందుకు అక్కడి ప్రజలు మండల కేంద్రానికి వెళ్లేందుకు సులువుగా ఉంటుంది.

– అనెమోని కృష్ణవేణి, సర్పంచ్, అప్పారెడ్డిపల్లి

10 రోజుల్లో పనులు పూర్తి



మండలంలోని అప్పారెడ్డిపల్లి రోడ్డుకు ప్రభుత్వం నుంచి రూ.88.38 లక్షల నిధులు రెండు విడతలుగా మంజూరయ్యాయి. పనులు వేగంగా జరుగుతున్నాయి. 10 రోజుల్లో పనులు పూర్తి చేసేందుకు కృషిచేస్తున్నాం.

– కబీర్‌దాస్, పీఆర్ ఏఈ, ఖిల్లాఘనపురం

బస్టాండ్‌లో రిఫ్రిజిరేటర్ ప్రారంభం

వనపర్తి టౌన్: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడానికి ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో చల్లని తాగునీటి రిఫ్రిజిరేటర్‌ను మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, డిపో మేనేజర్ పరమేశ్వరితో కలిసి ప్రారంభించారు. ఈ మేరకు చైర్మన్ మాట్లాడుతూ.. వేసవిలో చల్లనీటి కోసం డబ్బులు ఉన్నవారు బాటిళ్లను కొనుగోలు చేస్తున్నారని, డబ్బులు లేని ప్రజలు దాహంతో అలానే వేచిస్తున్నారని, అలాంటి వారి దాహార్తిని తీర్చడానికే ఈ సేవలు ప్రారంభించామని తెలిపారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ... ప్రజల దాహార్తిని తీర్చడానికి ఏర్పాటు చేసిన రిఫ్రిజిరేటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని, బస్టాండ్ ప్రాంగణంలో చెత్తచెదారం వేయకుండా సిబ్బందికి సహకరించాలని కోరారు.



తాగునీటి రిఫ్రిజిరేటర్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్ గట్టుయాదవ్

కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ చంద్రమౌళి, ఎంఎఫ్ యాదయ్య, బీఆర్ఎస్ నాయకులు ప్రేమ్‌నాథ్‌రెడ్డి, గోపాల్‌యాదవ్, ఆర్టీసీ సిబ్బంది వెంకటేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం సభకు తరలిన నాయకులు

పాన్‌గల్: ఖమ్మం జిల్లా కొత్తగూడెం నియోజకవర్గ కేంద్రంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనానికి మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు ఆయన అనుచరులు ఆదివారం వాహనాల్లో తరలివెళ్లారు. మాజీ ఎంపీపీ వెంకటేష్‌నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రవికుమార్, గోవర్ధన్‌సాగర్, పుల్లారావు ఆధ్వర్యంలో నాయకులు బయలుదేరారు.

నిబంధనలు అతిక్రమించొద్దు

కొత్తకోట రూరల్: మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని పెద్దమందడి ఎస్ఐ హరిప్రసాద్ మందుబాబులను హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవడంతో పాటు వాహనానికి సంబంధించిన పత్రాలను కలిగి ఉండాలన్నారు. మైనర్లకు బైక్‌లు ఇవ్వొద్దని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్న వ్యక్తులు వాహనాలు నడపాలని సూచించారు. చట్టానికి విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

కాల్వలకు నిలిచిన కేఎల్ఐ నీరు సరఫరా



కాల్వలో నిలిచిపోయిన సాగునీరు



పెద్దకొత్తపల్లి శివారులో సాగుచేసిన వేరుశనగ

పెద్దకొత్తపల్లి: కేఎల్ఐ నీరు కాల్వలకు వదలడం ఈ నెల 20 నుంచి నిలిపివేయడంతో పంటలు సాగుచేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల చివరి వరకు సాగునీరు అందితే పంటలు చేతికి వచ్చేవి. నీటి వసతి ఉన్న రైతులకు ఇబ్బందులుండవు. నీటి వసతి లేని రైతులు మాత్రమే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది. మండలంలో కేఎల్ఐ కాల్వలపై ఆధారపడి 500 ఎకరాలలో వరిసాగు, 300 ఎకరాలలో వేరుశనగ సాగు చేశారు. సంజీవాపూర్, చంద్రకల్, తిరుమలాపూర్, వెనచర్ల, నక్కలపల్లి, పెద్దకార్పాముల, జొన్నలబొగుడ, మల్రిపల్లి, దేవినేనిపల్లి గ్రామాలలో కాల్వలపై ఆధారపడి పంటలు సాగు చేశారు. ఈ నెల చివరి వరకు నీటిని వదలాలని రైతులు కోరుతున్నారు.

11న చలో హైదరాబాద్

కొల్లాపూర్: టెన్త్ పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పేపర్ లీకేజీ అంశంపై ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 11న చలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించారు. లీకేజీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పాత్ర ఉందన్నారు. ఆయన కుట్రల కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

చిన్నచింతకుంట: మండలంలోని చిన్న వడ్డెమాన్ సమీపంలో వెలసిన శ్రీ రామలింగేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి కల్యాణ మండపానికి మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఉత్సవ విగ్రహాలకు పట్టువస్త్రాలతో అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్చరణలతో కల్యాణం కనుల పండుగగా సాగింది. కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు చేశారు.



పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు

బాలల హక్కుల పరిరక్షణకు కృషి

కొల్లాపూర్: బాలల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తామని గ్రామిక వికాస కేంద్రం సంస్థ నిర్వాహకుడు లక్ష్మణ్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్‌వీకే కార్యాలయంలో సంస్థ 31వ వార్షికోత్సవం నిర్వహించారు. సంస్థ కార్యక్రమాలకు సహకారం అందిస్తున్న క్రై సంస్థ దక్షిణ భారత జనరల్ మేనేజర్ పీటర్ సునీల్ ఆన్‌లైన్ ద్వారా ఎస్‌వీకే సభ్యులతో మాట్లాడారు. సేవా కార్యక్రమాలను బాధ్యతాయుతంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో విజయమ్మ, తిరుపాలు, మహేష్, మన్సూర్, రేణుక, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగు పరిశీలన

కోయిల్‌కొండ: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు ఆదివారం ఖమ్మం జిల్లా అశ్వారావుపేటలో సాగుచేస్తున్న ఆయిల్ పాం పంటలను పరిశీలించారు. పంటల నుంచి వచ్చే గింజల ద్వారా నూనె ఎలా తీయాలి, ధర, లాభాలు, నష్టాలను అక్కడి రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రైతులు భీంరెడ్డి, రాజీరెడ్డి, నారాయణరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నాగన్న, కృష్ణయ్య, రవికిరణ్, నవీన్, రాజవర్ధన్‌రెడ్డి, చెన్నారెడ్డి, రవీందర్ తదితరులు ఉన్నారు.



ఆయిల్‌పాం పంటను పరిశీలిస్తున్న రైతులు

నేడు స్వచ్ఛ భారత్‌పై సమావేశం

మిడ్జిల్: స్వచ్ఛ భారత్ మిషన్ రెండో దశపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ కతలప్ప తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో వీఓఏలు, సాంకేతిక సహాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు విధిగా హాజరై, అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

‘బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించుదాం’



వనపర్తిలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు



ఆత్మకూర్‌లో..

వనపర్తి క్రైం: నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌చౌరస్తా వద్ద వైఎస్సార్‌టీపీ నాయకులు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ బూజల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ వస్తే నిరుద్యోగుల బతుకులు మారుతాయని, ఎన్నో ఉద్యమాలు, ఆత్మ బలిదానాలు చేస్తే సీఎం కేసీఆర్ గద్దెక్కిన తర్వాత నిరుద్యోగుల సమస్యలను పట్టించుకోవడమే మరిచాడని దుయ్యబట్టారు. ఉద్యోగుల భర్తీ లేక నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారని, నిరుద్యోగ భృతి హామీ ఎక్కడ అని ప్రశ్నించారు. 1.91లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వాటిని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ పాలనకు చమరగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయన్నారు. కార్యక్రమంలో తలకొండ మహేష్, చాణక్య, కాంతయ్య, రాజశేఖర్, సందీప్, లోకేష్ తదితరులు ఉన్నారు.

అమరచింత: రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోందని, సీఎం కేసీఆర్ పాలనలో ప్రజల బతుకులు దుర్భరంగా మారాయని వైఎస్సార్‌టీపీ మక్తల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ కర్ని గంగాధర్ ఆరోపించారు. వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిల ఆదేశాల మేరకు ఆత్మకూర్ మండల కేంద్రంలోని గాంధీచౌక్‌లో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులు, విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వైఖరి అవలంబిస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఆత్మకూర్ మండల అధ్యక్షుడు సత్యన్న, మక్తల్ మండల అధ్యక్షుడు ఉప్పరి నరేందర్, నర్వ మండల అధ్యక్షుడు మైబు, నాగేష్, హరీష్, నాగరాజ్‌రెడ్డి, వడ్డె రవి, ఖాజా, మనోహర్, వెంకటేష్, తిరుపతి, మురళి పాల్గొన్నారు.

‘ఏసయ్య దృష్టిలో అందరూ సమానమే’



ప్రవచనాలు వినిపిస్తున్న పాస్టర్

అమరచింత: ప్రేమను పంచడమే క్రీస్తు మార్గమని ఇతరులపై దయ, కరుణ కలిగి ఉండటమే ఉత్తమమైన మార్గమని పాస్టర్ హ్యాపీపాల్ అన్నారు. ఈస్టర్‌ను పురస్కరించుకొని ఆదివారం అమరచింతలోని ఎంబీ కర్మేల్ చర్చ్‌లో ప్రత్యేక ప్రార్థన, ఆరాధన కార్యక్రమాలను నిర్వహించారు. ఈమేరకు ఏసుక్రీస్తు పలికిన ఏడు ప్రవచనాలను తెలియచేశారు. ఏసుక్రీస్తు పాపులైన మానవుడికి అండగా నిలిచి వారిని విశ్వసించి వారి కుటుంబాల్లో వెలుగు నింపాడని తెలిపారు. సంఘంలో జీవించే ప్రతి ఒక్కరూ దేవుడి దృష్టిలో సమానమే అన్న విషయాన్ని గుర్తించుకోవాలని సూచించారు. సంపాదించిన ధనంలో ఏడాదిలో పదోవంతు పేదవారి క్షేమం కోసం ఖర్చు చేయాలని క్రీస్తు సూచించారన్నారు. పట్టణ పురవీధుల గుండా కల్వరి కొండ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫీల్డ్ చైర్మన్ జేపీ లూథర్, సంఘ ఉపాధ్యక్షుడు లేమ్యూలల్ రాజ్, ప్రధాన కార్యదర్శి దీనకుమార్, కోశాధికారి ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్‌లో..

ఆత్మకూర్ మండలంలోని మూలమళ్ల, ఖానాపురం, జూరాలతో పాటు పలు గ్రామాల్లో ఈస్టర్ పర్వదినాన్ని క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఏసు క్రీస్తు శిలువ ధరించిన విషయాలను, బైబిల్ ప్రవచనాలను పాస్టర్లు చదివి వినిపించారు.

పరిహారం ఇవ్వకుండా కాల్వలు ఎలా తవ్వుతారు?



ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ పగిడాల శ్రీనివాస్

వీపనగండ్ల: ఉమ్మడి మండలాల్లోని 30 వేల ఎకరాలకు సాగు నీరు అందించే సింగోటం, గోపల్‌దిన్నె లింక్ కెనాల్ ఏర్పాటులో భూములు కోల్పోతున్న రైతులకు పైసా పరిహారం చెల్లించకుండా కాల్వలు తవ్వి సాగునీరు అందిస్తామని చెప్పడం ప్రజలను మోసగించడమేనని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పగిడాల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో గడపగడపకు తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా తనను ఆదరించాలని ఓటర్లను అభ్యర్థించారు. మండల కేంద్రంలో రెండేళ్ల క్రితం ప్రారంభించిన 30 పడకల ఆస్పత్రికి వైద్యులను, అంబులెన్స్ వసతిని కూడా ఏర్పాటు చేయలేదని దుయ్యబట్టారు. 7వేల ఎకరాల్లో సాగు చేస్తున్న మామిడి రైతులు పండిన కొద్దిపాటి పంటను విక్రయించుకునేందుకు హైదరాబాద్ వెళితే 20 శాతం కమీషన్లు కట్‌చేస్తూ నిండా ముంచుతున్నారని వాపోయారు. కొల్లాపూర్‌లో మామిడి మార్కెట్ ఏర్పాటు చేస్తామని రెండేళ్లుగా అసత్య ప్రచారం చేస్తున్న వారికి తగిన గుణపాఠం నేర్పాలని ఆయన అన్నారు. గోవర్ధనగిరి డబుల్ బీటీ రోడ్డు పనులు ప్రారంభమై ఆరేళ్లు కావస్తున్నా పూర్తి చేయకపోవడం ఏంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సుధాకర్, పగిడాల సాయిధీరజ్, ఆంజనేయులుయాదవ్, బాలరాజు, అడ్వకేట్ అజయ్ కుమార్ యాదవ్, చందన్‌గౌడ్, చిన్నకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుదాం



పాన్‌గల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న సీపీఎం నాయకులు



ఆత్మకూర్, అమరచింత నాయకులు

పాన్‌గల్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను కలిసికట్టుగా ఎండగట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బాల్యనాయక్ అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ పాలనను వ్యతిరేకిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న సభకు ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల నుంచి నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతూ సామాన్యుల నడ్డి విరుస్తూ కార్పొరేటు శక్తులకు మేలు చేస్తుందని ఆరోపించారు. కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు, మహిళలకు రక్షణ కరువైందనే విషయాలను ప్రజలకు వివరిస్తూ వారిని చైతన్యం చేస్తూ వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఓటు ద్వారా గుణపాఠం చెబుతామన్నారు. కార్యక్రమంలో మౌలాలి, వెంకటస్వామి, ఆంజనేయులు, వెంకటయ్య, భగత్, భాస్కర్, మురళి, సాయిలీల పాల్గొన్నారు.

వీపనగండ్ల: ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో జరగనున్న ముఖ్య కార్యకర్తల సమావేశానికి మండలం నుంచి పలువురు నాయకులు బయలుదేరి వెళ్లారు. ఉభయ కమ్యూనిస్టు పార్టీల నాయకులు సీతారాం ఏచూరి, రాఘవులు, సీపీఐ జాతీయ కార్యదర్శి రాజా, నారాయణ ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారని సీపీఎం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సంగినేనిపల్లి సర్పంచ్ మౌలాలీ, మండల నాయకులు రాంచంద్రయ్య గౌడ్, సీహెచ్ వెంకటయ్య, నాగరాజు, ఈశ్వర్, శేఖర్‌రెడ్డి, వెంకటస్వామి, ముత్యాలు, రామకృష్ణ పాల్గొన్నారు.

అమరచింత: సీపీఐ, సీపీఎం పార్టీల ఆధ్వర్యంలో తొలిసారి హైదరాబాద్‌లో నిర్వహించే ఐక్యసభకు అమరచింత, ఆత్మకూర్ మండలాల నుంచి నాయకులు ఆదివారం తరలి వెళ్లారు. భవిష్యత్‌లో ఇరుపార్టీలు సమన్వయంలో కలిసి మరో పోరాటానికి అడుగులు వేస్తు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజా సమస్యలపై పోరాటం చేయడానికి ఇలాంటి సభ ఎంతో ఉపయోగపడుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. కార్యక్రమంలో రాబర్ట్, మోషా, లక్ష్మీనారాయణ, నరసింహశెట్టి, వెంకటేష్, నాగరాజు, బుచ్చన్న పాల్గొన్నారు.

గట్టు లింగమయ్య జాతరకు పోటెత్తిన భక్తులు



బోనాలు ఎత్తుకొస్తున్న మహిళలు

గోపాల్‌పేట: రేవల్లి మండల కేంద్రానికి సమీపంలోని గట్టు లింగమయ్య జాతరకు ఆదివారం భక్తులు పోటెత్తారు. రేవల్లి మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు బోనాలతో గట్టు లింగమయ్య స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. సింగిరెడ్డి వాసంతి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.